

న్యూస్‌రీల్

సమష్టి కృషితో మాతృశిశు సంక్షేమం

• డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: సమష్టి కృషితో మాతృశిశు మరణాల నివారణ సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథరావు అన్నారు. వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ప్రిజమ–10 కార్యక్రమంపై సూచనలిచ్చారు. సచివాలయాల పరిధిలో రక్తహీనతతో బాధపడే గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పౌష్టికాహార లోపం గల పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఆరోగ్యకర ఆహారం తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సత్యంనాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



జేసీకి స్వాగతం పలుకుతున్న డీఆర్వో, ఆర్డీఓ

సాక్షి, పార్వతీపురం మన్యం: ప్రభుత్వ ప్రాధాన్య అంశాలను సక్రమంగా అమలు చేస్తూ.. ప్రజలకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక తెలిపారు. జిల్లా నూతన జేసీగా వచ్చిన ఆమె.. గురువారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. తొలుత జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు, పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత తదితరులు ఆమెకు పూలమొక్కలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం 'సాక్షి'తో జేసీ మాట్లాడారు. ప్రభుత్వ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ ప్రాజెక్టులు, కార్యక్రమాల అమలును మరింత త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. అందరి సహకారంతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తానని వివరించారు.

గిరిజనులకు పోలీస్ సేవలు

- దుగ్గేరులో కమ్యూనిటీ పోలీసింగ్
- 235 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు
- దుప్పట్లు, చీరలు, దోమతెరలు, క్రీడాపరికరాల పంపిణీ
- వైద్యశిబిరాన్ని సందర్శించిన ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఏఎస్పీ సునీల్ షొరైన్



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

మక్కువ: గిరిజనులతో మమేకం కావడమే కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎస్పీ ఎం.విక్రాంత్‌పాటిల్ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దుగ్గేరు గ్రామంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఇక్కడ జరిగిన వారపు సంతకు వచ్చిన మక్కువ, సాలూరు మండలాల్లోని చిలకమెండంగి, మెండంగి, బాగుజోల, ఆలగురు వు, దిగువ మెండంగి, కొదమ తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు 235 మంది వైద్యసేవలు పొందారు. వీరికి శంబర పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్, మిమ్స్ ఆస్పత్రికి చెందిన వైద్యాధికారులు, సిబ్బంది వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. 25 మందికి శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. శిబిరాన్ని ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఏఎస్పీ సునీల్‌షొరైన్ సందర్శించా రు. గిరిజనులకు దుప్పట్లు, చీరలు, దోమతెరలు, గిరిజన యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశా రు. శిబిరానికి వచ్చేవారికి ఆహారంగా పులిహోరా పొట్లాలు అందజేశారు. సీఐ జి.బాలకృష్ణ, ఎస్ఐ పి.నరసింహమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవా అవార్డు

సాలూరు: సాలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 23వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త బలగ రాధకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో పీడీ రాణి అవార్డును అందజేశారు. ఆమె సేవలను అభినందించారు.

ఆమెలో.. సంక్షేమ సంతోషం

ఆమె.. నవ్వితే అందం.. ఇంటిల్లిపాదికి ఆనందం.. లక్ష్మీ రూపిణిగా ఓ ప్రత్యేక స్థానం. అమ్మగా, అక్కగా, చెల్లిగా, ఆలిగా అడుగడుగునా ఆత్మీయతను పంచే అద్భుతమూర్తి. ఓర్పు, నేర్పు ఆమె సొంతం. ఐదేళ్లుగా రాష్ట్రంలోని మహిళాలోకానికి సరైన ప్రాధాన్యం లభించింది. అన్నింటా ప్రభుత్వం అండగా నిలిచింది. సంక్షేమ పథకాల అమలులో ఆమెకే తొలి ప్రాధాన్యం కల్పించింది. ఆది శక్తికి ఆర్థిక, రాజకీయ, విద్యా, రక్షణ శక్తిని తోడుగా నిలిపింది. స్వావలంబన దిశగా నడిపించింది. నిజమైన మహిళా దినోత్సవాన్ని అందించి అందరిలో ఆనందం నింపింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సంక్షేమ' ఆనందాన్ని ఆమె మాటల్లో విందాం. – సాక్షి నెట్‌వర్క్

- ఐదేళ్ల పాలనలో అన్నింటా మహిళలకే తొలి ప్రాధాన్యం
- ఆర్థిక స్వావలంబన దిశగా 'ఆమె'
- మహిళల్లో ఆర్థిక వెలుగులు
- మారిన జీవన ప్రమాణాలు
- ఇదే నిజమైన మహిళా దినోత్సవం అంటున్న మగువలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఆర్థిక సంతోషం



మాది బొబ్బిలి మండలంలోని అరికతోట. మదర్‌థెరీసా పొదుపు సంఘంలోని సభ్యురాలిని. 2019లో రూ.7లక్షల బ్యాంకు రుణం తీసుకున్నాం. కేవలం రూ.60వేలు మాత్రమే కట్టాం. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ముఖ్యమంత్రి మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రుణాలు మాఫీ చేశారు. దీంతో మా సంఘ సభ్యులకు రూ.6లక్షల40వేలు ఆర్థిక ప్రయోజనం కలిగింది. చిరువ్యాపారాలు చేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్నాం. మహిళా 'సంక్షేమం' అంటే ఇదే కదా. మహిళలు బాగుండాలని కోరుకునే నాయకుడు పాలకుడు కావడం మా అదృష్టం.

– యజ్జల రత్నమ్మ, మదర్ థెరీసా మహిళా సంఘం సభ్యురాలు, అరికతోట

చదువుకు అండ



మాది వ్యవసాయ కూలీ కుటుంబం. రెక్కాడితే గాని డొక్కాడదు. ఆడ పిల్లలను చదివించలేం అనుకున్నాం. అదే సమయంలో జగనన్న ముఖ్యమంత్రి అయ్యారు. పిల్లలకు అమ్మఒడి కింద చదువు సాయం అందించారు. పాఠశాలను అందంగా ముస్తాబు చేసి చదువుల నిలయంగా తీర్చిదిద్దారు. జగనన్న విద్యాకానుకల పేరుతో అభ్యసన సామగ్రిని సమకూర్చారు. పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. అమ్మగా ఇంతకంటే ఇంకేమి సంతోషం ఉంటుంది. ఇదే నాకు నిజమైన మహిళా దినోత్సవం.

– కుమార్తె అనూషతో తల్లి రంధి బుజ్జి

జీవనానికి 'చేయూత'



నా పేరు పాండ్రంకి అప్పలపైడితల్లి. విజయనగరం మండలం చెల్లూరు గ్రామం. భర్త 15 ఏళ్ల కిందట మరణించారు. గ్రామంలోనే చిన్న అద్దె గదిలో ఒంటరిగా జీవించేదానిని. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక నా జీవితంలో 'నవరత్న' వెలుగులు వికసించాయి. ప్రతినెలా ఠంచన్‌గా రూ.3వేలు చొప్పున వృద్ధాప్య పింఛన్ అందుతోంది. వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750 చొప్పున నా ఖాతాలో జమయ్యాయి. ఈ మొత్తంతో కూరగాయల వ్యాపారం ప్రారంభించి ఆనందంగా జీవిస్తున్నా. సొంత బిడ్డల కంటే ఎక్కువగా తనలాంటి ఒంటరి మహిళల జీవితాలకు భరోసా కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. మాకు ఇదే నిజమైన మహిళా దినోత్సవం.

విద్యానందం



నా పేరు వలిరెడ్డి రాజేశ్వరి. గరివిడి శ్రీరామ్ నగర్ కాలనీలో ఉంటున్నాం. తల్లిదండ్రులు కూలీలు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతోనే గరివిడి అవంతి సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తిచేశాను. నాలుగేళ్లు జగనన్న విద్యాదీవెన పేరుతో ఏటా రూ.41వేలు చొప్పున తల్లి ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. పూర్తిఫీజు రీయింబర్స్ మెంట్ వర్తించడంతో ఆర్థిక కష్టాలు లేకుండా చదువుకోగలిగాను.

పాలనకు అవకాశం



నేను గిరిజన మహిళా రైతును. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఉద్యోగాలు, పదవుల్లో రిజర్వేషన్ కల్పించడంతో సర్పంచ్‌గా అవకాశం దక్కింది. సంక్షేమ పథకాల ఆర్థిక ప్రయోజనాలన్నీ మహిళల ఖాతాల్లో జమచేస్తూ సమాజంలో గౌరవం పెంచారు. ఇదే మహిళలకు నిజమైన ఉత్సవం.

– గొర్లె సత్యవతి, మహిళా రైతు,సారిక సర్పంచ్, సాలూరు మండలం

మనోధైర్యానికి మించిన ఆయుధం లేదు



మహిళలు మనోధైర్యంతో ముందుకు సాగాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా పక్షపాతిగా నిలుస్తోంది. దిశ యాప్‌ను మహిళలకు రక్షణ కవచంగా మార్చింది. స్వేచ్ఛగా జీవించే అవకాశం లభించింది.

– ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం

20 ఏళ్ల తరువాత రిజర్వేషన్‌తో అవకాశం



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలుకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించింది. దీనివల్ల 20 ఏళ్ల తరువాత మా గ్రామ పంచాయతీకి మహిళా రిజర్వేషన్ సర్పంచ్ పదవికి లభించింది. సర్పంచ్‌గా ఉత్తమ పాలన అందించేందుకు అవకాశం కలిగింది. ప్రభుత్వ కృషితో మహిళలకు సమాజంలో గౌరవం, సమానత్వం సమకూరింది.

– వావిలపల్లి ధనలక్ష్మి, సర్పంచ్, కాకరాపల్లి గ్రామ పంచాయతీ, సంతకవిటి మండలం



సాలూరులో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ

మహిళలకు గౌరవం పెరిగింది



వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను గౌరవిస్తూ అన్నింటా ప్రాధాన్యమిచ్చారు. ఆర్థిక స్వావలంబన కల్పించారు. రాజకీయ రంగంలో మహిళలను ప్రోత్సహించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితేనే ఆయా కుటుంబాలు బాగు పడతాయని గుర్తించి ఎక్కువ సంక్షేమ పథకాలకు మహిళలనే లబ్ధిదారులుగా గుర్తించారు. అందుకే.. ఆర్థిక, రాజీకయ రంగాల్లో మహిళలే మహరాణుల్లా ఉన్నారు.

– పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్యే, కురుపాం

మహిళా లోకాన్ని ప్రోత్సహించేలా..



రాష్ట్రంలో ప్రతిమహిళా తన తోబుట్టువుగా భావించి, మహిళా లోకాన్ని ఆర్థికంగా, రాజకీయంగా ప్రోత్సహిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అధికశాతం అక్కచెల్లమ్మల పేరిటే అమలవుతున్నాయి. ముఖ్యంగా అమ్మఒడి, ఆసరా, రుణమాఫీ వంటి పథకాలతో పాటు జగనన్న ఇళ్ల పట్టాలను లక్షలాది మంది అక్కచెల్లెమ్మల పేరిట అందించి సమాజంలో మహిళల స్థాయిని పెంచారు. రూ.లక్షల విలువ చేసే ఆస్తిని మహిళల పేరుతో అందించారు. మహిళా సాధికారతకు పెద్దపీటవేశారు. అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి



ఎక్కడైతే మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ముందంజలో ఉంటారో ఆ రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో పయనిస్తోంది. మహిళలకు నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి జగన్‌మోహన్‌రెడ్డి సముచిత గౌరవం ఇచ్చారు. 4.65 కోట్ల మంది మహిళల ఖాతాలకు నేరుగా సంక్షేమ పథకాల లబ్ధిని చేర్చారు. మహిళా పక్షపాతిగా నిలిచారు.

– నల్లబిల్లి సుహాసిని, వీరఘట్టం

భద్రత 'దిశ'గా..



మహిళల రక్షణ కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన దిశ చట్టం పటిష్టంగా అమలవుతుండడం మా అదృష్టం. ఈ చట్టం వల్ల మహిళలు స్వేచ్ఛగా తమ విధులు నిర్వర్తించగలుగుతున్నారు. మహిళల భద్రతకు భరోసా కలిగింది.

– భోగి లత, డైరెక్టర్, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్, వీరఘట్టం

కాంట్రాక్ట్ కాదిక.. రెగ్యులర్

- వైద్యశాఖ ఉద్యోగులకు శుభవార్త
- రాష్ట్రవ్యాప్తంగా 2146 మందికి క్రమబద్ధీకరణ
- ఉమ్మడి జిల్లాలో 154 మందికి వర్తింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

పార్వతీపురం టౌన్: వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ఆయా ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగురేఖలు నింపాయి. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలును తమ కుటుంబాలు మరువ లేనిదంటూ కాంట్రాక్ట్ ఉద్యోగులు భావోద్వేగానికి గురవుతున్నారు. 2002–03 నుంచి 1 ఏప్రిల్ 2014 నాటికి రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న 2,146మందిని రెగ్యులర్ చేస్తూ వైద్యశాఖ స్పెషల్ సీఎస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో 154మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నోచుకోనున్నారు. దీంతో వారంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

మాట నిలబెట్టుకున్నారు



2002వ సంవత్సరం నుంచి ఏపీ వైద్య విధాన పరిషత్ ద్వారా జిల్లా ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాను. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రకు విచ్చేసినప్పుడు మా క్రమబద్ధీకరణపై విన్నవించాం. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల సీఎం జగన్‌మోహన్ రెడ్డి ద్వారా సాకారమైంది.

– గెద్ద అప్పారావు, కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్, కేఆర్‌బీపురం

20 ఏళ్ల నిరీక్షణకు మోక్షం



గడిచిన 20 ఏళ్ల నిరీక్షణకు సీఎం జగన్ మోహన్ రెడ్డి తెరదించారు. ఆయన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం హర్షణీయం. రాష్ట్ర చరిత్రలో ఉద్యోగుల ఆర్థికాభివృద్ధికి కనీవినీ ఎరుగని చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారు. ఉద్యోగుల ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– జీవీఆర్ఎస్ కిశోర్, ఏపీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం

కలలో కూడా అనుకోలేదు



2003వ సంవత్సరం నుంచి వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్నాను. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్‌మోహన్ రెడ్డిని పాదయాత్రలో కలిసి మా ఆర్థిక ఇబ్బందులు తెలియజేశాం. నేడు మమ్మల్ని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తిస్తూ జీఓ విడుదల చేశారు. కలలో నైనా రెగ్యులర్ ఉద్యోగులవుతామని అనుకోలేదు.

– మెట్ట నీలవేణి, ఏఎన్ఎం, మామిడిపల్లి, సాలూరు మండలం

చరిత్రలో నిలిచిపోతారు



రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల హామీలు నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయం. గతంలో ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల కోరిక నెరవేర్చారు. గతంలో చంద్రబాబునాయుడు కాంట్రాక్ట్ ఉద్యోగులను మోసం చేశారు. జగనన్న వచ్చిన తరువాత మా సమస్యను పరిష్కరించారు.

– ఎస్ భరత్ భూషణ్ రాజు, కన్వీనర్ ఉత్తరాంధ్ర ఎంప్లాయీస్ అసోసియేషన్

జగనన్నకు కృతజ్ఞతలు

రాష్ట్రవ్యాప్తంగా 2146 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం సంతోషదాయకం. జగనన్న మేలు మరవలేం.

–వెంకటప్పన, హెల్త్ అసిస్టెంట్, పార్వతీపురం

ఇదే కదా.. మహిళా సాధికారత



ఈమె పేరు కర్రి గౌరమ్మ. పార్వతీపురం మండలం లక్ష్మీ రాజుపేట గ్రామం. ఈమెది అభయాంజనేయ స్వయం సహాయక సంఘం గ్రూపు. వైఎస్సార్ చేయూత నాలుగు విడతలు కలిపి రూ.75 వేలు అందింది. ఆ మొత్తంలో రెండు ఆవులు కొనుగోలు చేసి వాటి ద్వారా వచ్చే పాలు విక్రయిస్తోంది. ఎకరం పొలం కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తోంది. సంవత్సరానికి రూ.50 వేల వరకూ ఆదాయం వస్తోందని.. ఇంటి దగ్గర ఉండి ఒక మహిళగా అంతకంటే తనకు ఇంకేం కావాలని ఆమె అంటోంది.



ఈ చిత్రంలోని మహిళ బలగ మంగమ్మ. పార్వతీపురం మండలం తాళ్లబురిడి గ్రామం. శ్రీ మణికంఠ స్వయం సహాయక సంఘం, చేయూత నాలుగు విడతలు రూ. 75 వేలు రాగా.. ఆవు కొనుగోలు చేసింది. పాలు విక్రయం ద్వారా నెలకు రూ.8 వేలు ఆదాయం వస్తోంది. ఆ మొత్తంతో తన కుటుంబానికి అండగా నిలవగలుగుతున్నా అని.. ఇంటి ఖర్చులైనా గట్టెక్కుతున్నాయని మంగమ్మ చెబుతోంది.



ములగ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వయం సహాయక సంఘానికి చెందిన ఈమె వి.లక్ష్మి. చేయూత నాలుగు విడతల నిధులు రూ.75 వేలు విడుదలకాగా... ఆవును కొనుగోలు చేసి పాలు విక్రయిస్తోంది. కొన్ని రకాల పంటల సాగు ద్వారా ఆదాయం పొందుతోంది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.. వైఎస్సార్ చేయూత నిధులు ఎన్నో కుటుంబాలకు ఆర్థిక దన్నును అందిస్తున్నాయి. వివిధ వ్యాపారాలు చేసుకుంటూ ఇంటికి అండగా నిలుస్తున్నారు పలువురు మహిళలు.

- నాలుగో విడత వైఎస్సార్ చేయూత నిధులు జమ చేసిన ప్రభుత్వం
- ఆర్థిక స్వావలంబన సాధించామని చెబుతున్న మహిళలు
- పశువులు కొనుగోలు చేసి కొందరు.. చిరువ్యాపారాలు చేసుకుంటూ మరికొందరు

సాక్షి, పార్వతీపురం మన్యం:

వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత నిధులు మహిళల ఖాతాల్లో గురువారం జమయ్యాయి. జిల్లాలోని 72,854 మంది లబ్ధిదారులకు రూ.18,750 చొప్పున మంజూరైన రూ.136.60 కోట్ల విలువైన మెగా చెక్కును ఇన్‌చార్జి సంయుక్త కలెక్టరు సి.విష్ణుచరణ్ లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేయూత నిధులను మీట నొక్కి నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ సి.విష్ణుచరణ్, లబ్ధిదారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. తాజాగా జిల్లాలోని 45–60 ఏళ్ల మధ్య వయసు ఉన్న పేదవర్గాల మహిళలకు చేయూత కింద రూ.136.60 కోట్ల లబ్ధి చేకూరగా, నాలుగు విడతల్లో రూ.513.85 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగింది. నాలుగవ విడతగా పార్వతీపురం నియోజకవర్గంలో 19,381 మందికి రూ.36.34 కోట్లు, సాలూరు నియోజకవర్గంలో 14,271 మందికి రూ.26.76 కోట్లు, కురుపాంలో 19,688 మందికి రూ.36.92 కోట్లు, పాలకొండ నియోజకవర్గంలో 19,514 మందికి 36.59 కోట్ల రూపాయలు చొప్పున ఖాతాల్లోకి జమ చేశారు.



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న ఇన్‌చార్జి జేసీ, పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, డీఆర్‌డీఏ పీడీ తదితరులు

సుస్థిరమైన జీవనోపాధి.. మహిళల్లో ఆనందం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పేద, నిరుపేదలకు 'నవరత్నాలు' ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. మహిళల సమగ్ర అభివృద్ధి ఎజెండా, ఆర్థిక సాధికారతలో భాగంగా 'వైఎస్సార్ చేయూత' పేరుతో పథకాన్ని ప్రవేశపెట్టి 45 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు నాలుగు దఫాలలో రూ.75,000 ఆర్థిక సహాయం అందించింది. మహిళా లబ్ధిదారులు కుటుంబ స్థాయిలో మెరుగైన జీవనోపాధులను అందిపుచ్చుకునే విధంగా అవకాశాలను కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం. సుస్థిరమైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా అందించిన డబ్బులతో మహిళలు పశువుల పెంపకం, పాల సేకరణ, ఆరోగ్య సేవలు, కిరాణా షాపులు, వస్త్ర దుకాణాల ఏర్పాటు, పండ్లు, కూరగాయల విక్రయాలు, చిన్న జీవాల కొనుగోలు, చిన్న మధ్య తరహా వ్యాపారాలు నడుపుకోవడం వంటివాటితో ఉపాధి పొందినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జననేతకు ఆత్మీయ స్వాగతం



వైఎస్సార్ చేయూత పథకం నాలుగో ఏడాది నిధులు బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమానికి గురువారం అనకాపల్లి జిల్లాలోని పిసినికాడకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జననేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి పలువురు నాయకులు ఘనస్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి పుష్పగుచ్ఛం అందజేశారు. ముఖ్యమంత్రి వారిని ఆత్మీయంగా పలుకరించారు.

- సాక్షి ప్రతినిధి, విజయనగరం

శ్రీశైలంలో నృత్యప్రదర్శన



శ్రీశైల క్షేత్రంలో నృత్యప్రదర్శన చేస్తున్న సాయి సుప్రియ బృందం

విజయనగరం టౌన్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని విజయనగరంలోని 'అభినయ ప్రియ' నర్తనశాల ఆధ్వర్యంలో సాయిసుప్రియ నిర్వహించిన భరతనాట్య నృత్యప్రదర్శన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. తన శిష్యబృందంతో కలిసి ఎనిమిదేళ్లుగా శ్రీశైలంలో భరతనాట్య ప్రదర్శన ఇస్తున్నట్లు జిల్లాకు చెందిన సుప్రియ గురువారం తెలిపారు. ఆలయ ఈఓ పెద్దిరాజు, పీఆర్‌ఓ శ్రీనివాస్‌లు చేసిన సత్కారం మరువలేనిని సంతోషం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినుల తల్లిదండ్రులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

సీనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు పయనం

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సీనియర్స్ పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు గురువారం పయనమైంది. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ నెల్లూరు జిల్లా కోవూరులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లేముందు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విజయ్‌ను క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

ఉద్యానవన అధికారిగా ఉమాభరణి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యానవన అ ధికారిగా బి.ఉమాభరణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడును కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నుంచి బదిలీపై వచ్చినట్లు చెప్పారు. ప్రధానంగా నగర సుందరీకరణ, ల్యాండ్ స్కేపింగ్, అర్బన్ గ్రీనింగ్ వంటి సేవలను ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ, సహకారాలతో సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

నేడు మహిళా కార్మికులకు సన్మానం

విజయనగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్వగృహంలో శుక్రవారం ఉదయం మహిళా పారిశుధ్య కార్మికులను సన్మానించనున్నట్లు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. పారిశుధ్య పరిరక్షణలో మహిళా కార్మికుల పాత్ర కీలకమన్నారు. ప్రతిరోజూ నగరంలో చెత్తాచెదారాలను సేకరిస్తూ పరిశుభ్ర వాతావరణన్ని నెలకొల్పుతున్నారని కొనియాడారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య విభాగంలో 170 మంది మహిళా కార్మికులున్నారని.. వారందరినీ సత్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు గదుల సత్యలత, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'లక్ష్య' వార్షికోత్సవం



లక్ష్య - 2024 సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'లక్ష్య' వార్షికోత్సవం గురువారంతో ముగిసింది. సాంకేతిక విజ్ఞాన ప్రదర్శన, రోబో రేస్, రోబో వార్‌లలో పలు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం వార్షిక సంచిక లక్ష్య - 2024ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ కె.శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, విభాగాధిపతి కె.సుబ్బరామయ్య పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు వేళాయె

- రామతీర్థంలో రెండు రోజుల పాటు జాతర
- ప్రత్యేక ఆకర్షణగా శిఖర జ్యోతి

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ రామస్వామివారి దేవస్థానంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి దాదాపు లక్షమందికి పైగానే భక్తులు ఈ జాతరకు రానున్నారని అంచనా. దేవస్థానం, ఇతర శాఖల సిబ్బంది ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రామాలయం, శివాలయం వద్ద టెంట్లు, ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. అలాగే రామకోనేరు వద్ద భక్తుల స్నానాలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విజయనగరం వైపు నుంచి వచ్చే భక్తులకు సీతారామునిపేట వద్ద, రణస్థలం వైపు నుంచి వచ్చే భక్తులకు దన్నానపేట జంక్షన్ వద్ద పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సుమారు 150 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు తమ సేవలను అందించనున్నాయి. శాశ్వత కేశఖండన శాల వద్ద పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రథమ చికిత్స అందించేందుకు నెల్లిమర్ల, కొండవెలగాడ వైద్య సిబ్బందితో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఉమా సదా శివాలయంతో పాటు రామాలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. శుక్రవారం వేకువ జాము నుంచి రణస్థలం, విజయనగరం కేంద్రాల నుంచి ఆర్టీసీ బస్సులు సేవలందిస్తాయి. బోడికొండ సందర్శనకు వెళ్లే భక్తులు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిక బోర్డులను అనుసరించి వెళ్లాలని దేవాదాయశాఖతో పాటు పోలీస్ యంత్రాంగం కోరుతోంది.



రామక్షేత్రం చుట్టూ ఏర్పాటు చేసిన టెంట్లు



పూల అలంకరణతో ఉమాసదాశివాలయం



లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్న స్వామి సేవకులు

శివాలయంలో ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి పర్వదినాన శివాలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. బ్రహ్మముహూర్త కాలంలో గణపతి పూజ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కామాక్షి అమ్మవారికి హారతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు గణపతి పూజ, మహాన్యాస పారాయణం జరిపించి 11 రకాల పండ్ల రసాలు, భస్మం, చందనం, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు, నారికేళ జలాలతో శివుడికి అభిషేకాలు జరిపిస్తారు. అర్ధరాత్రి 12 గంటలకు మహా లింగోద్భవ సమయంలో స్వామికి విభూది సమర్పణ చేస్తారు.

శిఖర జ్యోతి ప్రత్యేక ఆకర్షణ

రామతీర్థంలో శుక్రవారం సాయంత్రం సుమారు 6 గంటలకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శిఖర జ్యోతిని వెలిగిస్తారు. ఆయన సొంత నిధులతో జరగనున్న ఈ కార్యక్రమంలో 300 కేజీల నెయ్యితో వెలిగించే జ్యోతి రెండు రోజుల పాటు బోడికొండపై ఈ భక్తులను కనువిందు చేయనుంది. శిఖర జ్యోతి కార్యక్రమం అనంతరం రూ.ఒక లక్ష విలువ చేసే బాణసంచాను పెద్ద ఎత్తున కాల్చనున్నారు.

నడకయాతనకు విముక్తి

- నాగావళి నదిపై వంతెన పూర్తి
- అందుబాటులోకి వచ్చిన కిమ్మి-రుషింగి బ్రిడ్జి
- వైఎస్సార్‌సీపీ చొరవతో పుష్కర కాలం కల సాకారం
- ఈనెల 11న ప్రారంభించనున్న విద్యాశాఖ మంత్రి బొత్స



కిమ్మి-రుషింగి వంతెన

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం మండలం, విజయనగరం జిల్లాలోని వంగర మండలాల ప్రజలు 12 ఏళ్లుగా ఎదురు చూస్తున్న కిమ్మి-రుషింగి వంతెన ప్రారంభానికి సిద్ధమైంది. కొద్ది రోజుల క్రితం వంతెన, ఇరువైపులా అప్రోచ్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో ఈనెల 11న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ వంతెనను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం, వంగర, బలిజిపేట, గరుగుబిల్లి, బొబ్బిలి మండలాల్లోని సుమారు 40 గ్రామాల ప్రజలకు నడక కష్టం దూరమైంది. దీంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ కిమ్మి-రుషింగి చరిత్ర..

నాగావళి నదిలో కిమ్మి-రుషింగి గ్రామాల మధ్య 2008లో జరిగిన పడవ ప్రమాదం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఈ విషాద ఘటనపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే వైఎస్ఆర్ మరణానంతరం సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.29.5 కోట్లు నిధులు మంజూరు చేశారు. 2012లో శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కొత్తూరు మండలంలో రిమోట్ శంకుస్థాపన చేశారు. తర్వాత పనులు ప్రారంభమయ్యాయి. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం చిత్తశుద్ధి చూపకపోవడంతో వంతెన పనుల్లో వేగం తగ్గింది. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణంపై దృష్టి సారించడంతో పనులు పూర్తయ్యాయి.

11న వంతెన ప్రారంభిస్తాం

కిమ్మి-రుషింగి వంతెన పనులు పూర్తయ్యాయి.ఈనెల 11న రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ వంతెనను ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తారు. వంతెన నిర్మాణం పూర్తికావడంతో వీరఘట్టం, వంగర మండలాలతో పాటు బలిజిపేట, బొబ్బిలి, గరుగుబిల్లి మండలాల్లోని గ్రామాలకు మార్గం సుగమమైంది.

బి.గౌరీశ్వరరావు, డీఈఈ, ఆర్అండ్‌బీ

జాతీయ తైక్వాండో పోటీల్లో రాణించాలి

- క్రీడాకారిణిని అభినందించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



హిమశ్రీని అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జాతీయస్థాయి త్వైకాండో పోటీలకు నగరానికి చెందిన వి. హిమశ్రీ ఎంపిక కావడం గర్వంగా ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ మేరకు గురువారం తన స్వగృహంలో ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా తైక్వాండో చీఫ్ కోచ్ డీవీ చారి మాట్లాడుతూ నగరానికి చెందిన వి.హిమశ్రీ ఇటీవల పాండిచ్చేరిలో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ తైక్వాండో పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించి, త్వరలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికైందని చెప్పారు. ఈనెల 9, 10, 11 తేదీలలో ఒడిశా రాష్ట్రంలోని, కటక్‌లో జరగనున్న ఆలిండియా జాతీయ పోటీల్లో తన సత్తా మరోసారి నిరూపించనుందన్నారు. గతంలో మూడుసార్లు జాతీయ పోటీలలో హిమశ్రీ పతకాలను సాధించిందని గుర్తుచేశారు.క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పోక్సో కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్ష

పార్వతీపురంటౌన్: పోక్సో కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ విజయనగరం ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి కె.నాగమణి తీర్పు వెలువరించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 12 జవవరి 2021 సంవత్సరంలో సాలూరు మండలంలోని మామిడిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై లైంగికదాడినట్లు పాల్పడినట్లు బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన పెరుమళ్ల రమణయ్య కేసు నమోదైంది. ఈ కేసులో త్వరితగతిన పోలీసులు విచారణ చేపట్టి వాస్తవాలను కోర్టుకు సమర్పించారు. ఈ మేరకు విచారణ జరగడంతో నేరం నిర్ధారించిన కోర్టు పై విధంగా తీర్పు వెలువరించినట్లు ఎస్పీ వివరించారు.

11న విజయనగరంలో అప్రెంటిస్ మేళా



జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి భీమశంకరరావు

కొత్తవలస: ఈ నెల 11వ తేదీన విజయనగరం జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారం వద్ద గల ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎస్.భీమశంకరరావు తెలిపారు. ఈ మేరకు కొత్తవలసలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ అప్రెంటిస్ మేళాలో ఐటీఐ, ఇంటర్మీడియట్ పూర్తిచేసిన వారు పాల్గొనవచ్చన్నారు. ఈ మేళాకు రెడ్డీస్ ల్యాబ్స్, టిర్రీ అల్లాయీస్, మైలాన్, వరుణ్ మోటార్స్, జయభేరి, జిందాల్ స్టీల్స్, డెక్కన్ ఫెర్రో అల్లాయీస్, శారద స్టీల్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగిన స్టైపెండ్ చెల్లిస్తారని తెలిపారు. అప్రెంటిస్ మేళాలో పాల్గొన దలచిన వారు బయోడేటా, ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, రెండు పాస్‌పోర్టు ఫోటోస్‌తో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 98491 18075, 98499 44654 నంబర్లను సంప్రదించాలని స్పష్టం చేశారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘా పటిష్టం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘా మరింత పటిష్ట పరిచామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం సరిహద్దు గ్రామమైన అడారు అంతర్రాష్ట్ర చెక్ పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం నుంచి సారా, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా పెంచామని తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు. చెక్‌పోస్టుల సిబ్బంది అప్రమత్తంగా ఉండి అనుమానం కలిగానా, ముందస్తు సమాచారం ఉన్నా తక్షణమే అధికారులకు సమాచారం చేరవేయాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో గిరిజనులకు పథకాలు

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు



ఏరియా ఆస్పత్రిలోని ఎన్ఆర్‌సీని పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

సీతంపేట: అధికారులు బాధ్యతగా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో గిరిజనులకు సంక్షేమ పథకాలు అందాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అన్నారు. ఈ మేరకు సీతంపేట ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరిలో ఐటీడీఏ సెక్టోరియల్ అధికారులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో శాఖ అమలు చేస్తున్న పథకాలను ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఆయనకు వివరించారు. అనంతరం చైర్మన్ డీవీజీ శంకరరావు మాట్లాడుతూ పథకాలు పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరముందని, అధికారుల కృషిలేకుండా అభివృద్ధి జరగదన్నారు. ఇంజినీరింగ్ శాఖ ద్వారా జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అర్హులైన వారందరికి ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చి రైతు భరోసా కల్పించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలు, నాల్గోతరగతి సిబ్బంది కొరత ఉందన్న విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

గిరిజనుల అభివృద్ధికి సీఎం కృషి

పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మాట్లాడుతూ ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్టీ కమిషన్ చైర్మెన్‌గా శంకరరావును నియమించడం గిరిజనులకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆదివాసీల అభివృద్ధికి సీఎం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. టెన్త్ ఆపైన చదువుతున్న విద్యార్థులకు ఐటీడీఏలో గైడెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంటర్మీడియట్ చదువుకోవడానికి వీలుగా అవసరమైన మరిన్ని కళాశాలలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు.

ఏరియా ఆస్పత్రి సందర్శన

అంతకు ముందు ఏరియా ఆస్పత్రిని కమిషన్ చైర్మన్ సందర్శించారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఎన్ఆర్‌సీ, ప్రసూతి కేంద్రం, ఇన్‌పేషెంట్ వార్డు, ఫిజియోథెరపీ రూమ్‌లను పరిశీలించారు. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, ఏపీవో రోసిరెడ్డి, గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, డీఈ కృష్ణకుమార్, డిప్యూటీఈవో లిల్లీరాణి, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, జనరల్ సర్జన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రతిపాదనలు సమర్పించాలి

- జేసీ కె.కార్తీక్

విజయనగరం అర్బన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుకు సంబంధించి సమాచార శాఖ నుంచి అందిన జాబితాలో అర్హులైన వారిని గుర్తించి, వారికి కే టాయించేందుకు అవసరమైన స్థలాలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని రెవెన్యూ డివిజ నల్ అధికారులను జేసీ కె.కార్తీక్ ఆదేశించారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులు, డీపీఆర్‌ఓతో టెలికా న్ఫరెన్స్ ద్వారా జేసీ కార్తీక్ గురువారం సమీక్షించారు. జిల్లాలో జర్నలిస్టుల ఇళ్లస్థలాల కోసం 369 దరఖాస్తులు అందా యని, వాటిని అన్ని మండలాల తహసీల్దార్లకు కలెక్టరేట్ ద్వారా పంపించిన ట్లు డీపీఆర్‌ఓ డి.రమేష్ వివరించారు. ఒక్కో జర్నలిస్టుకు మూడు సెంట్ల స్థలం కేటాయించేలా ప్రతిపాదనలు చేయాలని జేసీ కార్తీక్ స్పష్టం చేశారు.

ఆశలు చిగురించాయా?

- తనకే చీపురుపల్లి టికెట్ అంటున్న కిమిడి నాగార్జున
- అధిష్టానం తననే పని చేసుకోమందని వ్యాఖ్య

చీపురుపల్లి: నియోజకవర్గ టీడీపీలో గందరగోళం కొనసాగుతోంది. ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థిపై ఆ పార్టీ అధిష్టానం కలిగించిన అయోమయం కొనసాగుతోంది. 2019లో ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పటి నుంచి నియోజకవర్గంలో ఇన్‌చార్జిగా, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ కార్యక్రమాలు కొనసాగించిన కిమిడి నాగార్జునకు ఎన్నికలు సమీపించిన సమయంలో పోటీకి పనికి రాడని పార్టీ అధిష్టానం ఎల్లో మీడియా ద్వారా లీకులు ఇచ్చింది. దీంతో అవమానానికి గురైన కిమిడి నాగార్జున అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో రెండు వారాలుగా నియోజకవర్గంలో పార్టీ క్యాడర్ నిస్తేజంగా మారింది. ఇంతలో ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేస్తారని మాజీ మంత్రి గంటాశ్రీనివాస రావుతో పాటు విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పేరు కూడా వినిపించింది. ఈ నేపథ్యంలో తనదే చీపురుపల్లి టీడీపీ టికెట్ అంటూ కిమిడి నాగార్జున గురువారం మీడియా ముందు వెల్లడించడంతో ఆయన ఆశలు చిగురించాయా? అని చర్చ జరుగుతోంది. అసలు మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేసేందుకు టీడీపీలో అభ్యర్థి కరువయ్యాడనే చర్చ కూడా జోరుగా సాగుతోంది.

మహిళలు స్వీయభద్రతపై దృష్టి సారించాలి

విజయనగరం అర్బన్: స్వీయ భద్రతపై ప్రతి మహిళ దృష్టి సారించాలని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పుస్కరించుకుని ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన 'మహిళల ఆర్థికాభివృద్ధికి పెట్టుబడి పెట్టండి: ప్రగతిని వేగవంతం చేయండి' అనే అంశంపై స్థానిక గిరిజన యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను స్ఫూర్తిగా తీసుకోవడానికి ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారన్నారు. మహిళలు శారీరకంగా మానిసికంగా దృఢంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొగల సత్తా కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు ఆత్మరక్షణ/స్వీయరక్షణపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. యూనివర్సిటీ అంతర్గత ఫిర్యాదు కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పరికిండ్ల శ్రీదేవి ఆధ్వర్యంలో కరాటే జాతీయ స్థాయి బ్లాక్‌బెల్ట్, జాతీయ రిఫరీ గౌరీశంకర్ విద్యార్థినులకు ఆత్మరక్షణకు సంబంధించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం శిక్షకులకు వీసీ జ్ఞాపికలు అందజేశారు.

చికెన్	బ్రాయిలర్	లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
		₹125	₹220	₹230

మైలాన్‌లో విష వాయువు లీక్ ?

- పలువురు కార్మికులకు అస్వస్థత
- విపత్తును సమర్థంగా ఎదుర్కొన్న యంత్రాంగం

పూసపాటిరేగ: మండలంలోని ఓ రసాయన పరిశ్రమలో ఉదయం 10 గంటల సమయంలో స్టోరేజీ ట్యాంకు నుంచి ట్యాంకర్‌లోకి రసాయనాన్ని ఎక్కిస్తుండగా, అన్‌లోడింగ్ వాల్వ్ వద్ద రసాయనం కొద్దిగా లీక్ అయింది. అదే సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ వేడికి గ్యాస్‌కట్ కరిగిపోయిన కారణంగా సమీపంలో 50 కిలోల అమోనియా సిలిండర్‌కు జతచేసి ఉన్న పైప్‌లైన్ నుంచి ఒక్కసారిగా ప్రమాదకరమైన అమోనియా గ్యాస్ లీకైంది. ఇది వ్యాపించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందిపై తీవ్ర ప్రభావం చూపించింది. లీకైన గ్యాస్ పరిశ్రమ దక్షిణ దిశగా 1.5 కిలో మీటర్ల దూరంలోని చోడమ్మఅగ్రహారం వైపు ప్రయాణించింది. గ్యాస్ లీకైన వెంటనే దీనిని గుర్తించిన భద్రతా పరికరాలు సిబ్బందిని హెచ్చరిస్తూ అలారం మోగించాయి. అంతే ఒక్కసారిగా కార్మికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీయడంతో పరిశ్రమలో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ భద్రతా విభాగం హుటాహుటిన రంగంలోకి దిగి ప్రమాద సైరన్ మోగిస్తూ సిబ్బందిని హెచ్చరించారు. మాస్కులు, సేఫ్టీ సూట్లు ధరించి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని అదుపుచేసే చర్యలు ప్రారంభించారు. చుట్టుపక్కల చెలరేగిన మంటలను నీటి ట్యాంకర్లతో ఆర్పివేశారు. ప్రమాదానికి గురైన కార్మికులను అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన విషయాన్ని జిల్లా అధికారులకు, ఫ్యాక్టరీ భద్రతా విభాగం అధికారులకు సమాచారం ఇచ్చారు.

అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

ప్రమాదవార్త తెలిసిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. రెవెన్యూ, ఫ్యాక్టరీస్, విపత్తుల నిర్వహణ సంస్థ, ఎన్‌డీఆర్ఎఫ్, కాలుష్య నియంత్రణమండలి, అగ్నిమాపక శాఖ అధికారులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని శాఖా పరమైన విధులు నిర్వర్తించారు. గేటు బయట ఏర్పాటు చేసిన స్టాంగ్ ఏరియా నుంచి సహాయక చర్యలను సమీక్షించారు. ఫ్యాక్టరీ బయట ప్రథమ చికిత్స కేంద్రం, సహాయ శిబిరాలను ఏర్పాటు చేశారు. స్వల్పంగా గాయపడిన వారిని వలంటీర్లు శిబిరానికి తరలించి చికిత్స అందించారు. కొద్దిసేపటికి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సమీప గ్రామం చోడమ్మ అగ్రహారం ప్రజలను ఈ ప్రమాదకరమైన గ్యాస్ బారిన పడకుండా, గ్రామ సమీపంలోని పునరావాస కేంద్రానికి తరలించారు. అయితే ఇదంతా నిజమైన ప్రమాదం కాదు. ఒక వేళ ఇలాంటి ఉపద్రవం సంభవిస్తే, దానిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేసే చర్యల్లో భాగంగా పూసపాటిరేగ మండలంలోని గైతులచోడవరం సమీపంలో గల మైలాన్ ల్యాబొరేటరీస్‌లో నిర్వహించిన మాక్‌డ్రిల్ ఇది.



అంబులెన్సులో క్షతగాత్రులను తరలిస్తున్న దృశ్యం